నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

13 | హైదరాబాద్, గురువారం 11 జనవరి 2024 | SANGAREDDY




సిద్ధివినాయక స్వామివారి ఆలయం (ఇన్‌సెట్లో స్వయంభూ సిద్ధివినాయక స్వామి విగ్రహం)

## లోకాలను ఏలే నాయక..

**రేపటినుంచి ఉత్సవాలు**

# రేజింతల్ వినాయక

- ముస్తాబైన న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక క్షేత్రం
- నాలుగు రోజుల పాటు ప్రత్యేక యజ్ఞాలు
- తరలిరానున్న మూడు రాష్ట్రాల భక్తులు
- ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

న్యాల్‌కల్, జనవరి 10: లోకాలనేలే నాయకుడి 224వ జయంతోత్సవాలకు సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక పుణ్యక్షేత్రం ముస్తాబైంది. ఈనెల 12వ తేదీ నుంచి 15 వరకు జయంతోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రసిద్ధిగాంచిన వినాయక ఆలయాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని కాణిపాకం మొదటిదికాగా, రెండోది రేజింతల్ గ్రామ శివారులోని వెలిసిన సిద్ధివినాయక ఆలయం. భక్తులు కొంగుబంగారంగా కొలిచే స్వామివారి జయంతోత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. నాలుగు రోజులపాటు జరిగే జయంతోత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్, అవసరమైన ప్రసాదాలు, అన్నదానం ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ డీఎస్పీ రఘు ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నాలుగు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు**

ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో 12న ఉదయం 6 గంటల నుంచి వేదఘోష, దీప ప్రజ్వలన, ధ్వజారోహణం, స్వస్తి పుణ్యాహవాచనం, మాతృకా పూజ, ఆచార్య రిత్వికవర్ణం, ఉదయం 8 గంటలకు స్వామి వారికి అభిషేకం, 9 గంటలకు యాగశాల ప్రవేశం, దేవతాఆహ్వానం, మండపారాధన, 10 గంటలకు గణపతి హవనమం, శతచండీహవనం, మధ్యాహ్నం 2 గంటలకు మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, 13న స్వామివారికి ఆభిషేకం, 9 గంటలకు లక్ష పుష్పార్చన, 10 గంటలకు గణపతి హవనం, శతచండీహవనం, మధ్యాహ్నం 2 గంటలకు మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ, 14న స్వామివారి జయంతి సందర్భంగా విశేష ఫలపంచామృత అభిషేకం, గణపతి హవనమం, శతచండీహవనం, మధ్యా హ్నం 2.21 గంటలకు మహా పూర్ణాహుతి, మహామంగళహారతి, మహానైవేద్యం తీర్థప్రసాద వితరణ, 15న స్వామివారికి అభిషేకం, 9 గంటలకు సిద్ధిబుద్ధి సమేత స్వామివారి కల్యాణోత్సవం, 12 గంటలకు మహా మంగళ హారతి కార్యక్రమాలు జరుగుతాయి. జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12, 13, 14 తేదీల్లో జరిగే యజ్ఞాల్లో పాల్గొనే భక్తుల కోసం గణపతి హవనం, శత చండీ హవన యజ్ఞ గుండాలను సిద్ధం చేశారు.

### రానున్న మూడు రాష్ట్రాల భక్తులు

నాలుగు రోజులపాటు జరిగే రేజింతల్ సిద్ధి వినాయక స్వామి జయంతోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ ట్రస్టు అధ్యక్షుడు రేజింతల్ అశోక్, ప్రధానకార్యదర్శి అల్లాడి నర్సింహులు కోరారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్ల సిద్ధం చేశారు. దర్శనం కోసం ప్రత్యేకంగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం, తాగునీరు, వసతి సౌకర్యాలను ఏర్పాట్లు చేశారు.



గజ్వేల్‌లో కబడ్డీ క్రీడా పోటీలకు సిద్ధమైన మైదానం

## కబడ్డీ పోటీలకు సిద్ధమైన గజ్వేల్

- నేటి నుంచి గజ్వేల్‌లో రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు
- పాల్గొననున్న 1000 మంది క్రీడాకారులు

గజ్వేల్‌అర్బన్, జనవరి 10: నాలుగు రోజుల పాటు జరుగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు గజ్వేల్ పట్టణం ఆతిథ్యం ఇవ్వనున్నది. ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు క్రీడాపోటీలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 1000 మంది క్రీడాకారులు, మరో 200 మంది రాష్ట్ర, వివిధ జిల్లాలకు చెందిన రాష్ట్ర స్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొననున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తెలిపారు. స్థానిక మైదానంలో నిర్వహించనున్న ఈ క్రీడల నిర్వహణకు 4 సింథటిక్ మ్యాట్లతో కూడిన కబడ్డీ కోర్టులు, ఎడ్యుకేషన్ హబ్‌లో క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# వేతన వేదన

## సంక్రాంతి పండుగకు సెర్ప్ ఉద్యోగులు పస్తులే..

- 11వ తేదీ వచ్చినా వేతనాలు రాలే
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 487 మంది ఉద్యోగులు
- గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా వేతనాలు ఇయ్యలే
- పండుగ ఎలా చేసుకునేది అంటూ ఉద్యోగులు ఆందోళన



సిద్దిపేట, జనవరి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో ప్రకటించింది. సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రమే నిరాశే మిగిలింది అని చెప్పాలి. ఆ ఉద్యోగులకు ఇప్పటి వరకు వేతనాలు రాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 3,915 మంది ఉద్యోగులు ఉండగా ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం 487 మంది పని చేస్తున్నారు. వీరితో పాటు కాంట్రాక్ట్ లెక్చరర్లు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు సైతం వేతనాలు పడలేదు. కాంగ్రెస్ పార్టీని నమ్మి గెలిపించిన ఉద్యోగులకు ఇప్పుడు ఆ పార్టీ చుక్కలు చూపిస్తోంది. రెండు రోజుల్లో పండుగ ఉంది, తాము పండుగ ఎలా చేసుకునేది అని ఆయా శాఖల ఉద్యోగులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మొత్తం 487 మంది ఉద్యోగులు**

ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలో కలిపి సెర్ప్ కింద మొత్తం 487 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో162, మెదక్ జిల్లాలో 133మంది, సంగారెడ్డి జిల్లాలో 192 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగులు గ్రామాల్లో కీలక పాత్ర వహిస్తారు. వీరు గ్రామీణాభివృద్ధి శాఖ కింద పని చేస్తారు. గ్రామాలు, పట్టణాల్లో మహిళా సంఘాలను ఏర్పాటు చేయడం, వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు నందించడంతో పాటు గ్రూప్‌లోన్స్ ఇప్పించడం, బ్యాంక్ రుణాలను మహిళా సంఘాలకు ఇప్పించడం, సకాలంలో రుణాల చెల్లింపులో ఈ ఉద్యోగులది కీలక పాత్ర . ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంతో పాటు ప్రతి సంక్షేమ పథకం అందేలా ఈ ఉద్యోగులు కృషి చేస్తారు. ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానంగా వ్యవహరిస్తున్నారు. ఇంతలా కృషి చేస్తున్న తమకు వేతనాలను సకాలంలో ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది అని వారు వాపోతున్నారు. ప్రభుత్వం వివిధ శాఖల ఉద్యోగులకు 5వతేదీలోగానే వేతనాలు వేసింది. తమకు మాత్రమే 11వ తేదీ వచ్చినా వేతనాలు వేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు కాంట్రాక్ట్ లెక్చరర్లకు సైతం రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని వారు వాపోతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం వారు 35 మంది వరకు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 18, మెదక్ జిల్లాలో 10, సంగారెడ్డి జిల్లాలో ఏడుగురు పని చేస్తున్నారు. వీరితో పాటు జిల్లా స్థాయి, మండల స్థాయి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం వేతనాలు అందలేదు. నమస్తే తెలంగాణ సేకరించిన వివరాల ప్రకారం మరికొన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా వేతనాలు అందలేదని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేతనాలు ఆలస్యమయ్యాయి.. ఈఎంఐలు ఎలా కడతారు అని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నాయకులు మరీ ఇవాళ సకాలంలో అన్ని శాఖల ఉద్యోగులకు ఎందుకు వేతనాలు ఇవ్వడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇష్టం వచ్చిన హామీలు ఇచ్చి ఇవాళ అన్ని వర్గాలను, ఉద్యోగులను మోసం చేస్తున్నదని విమర్శించారు. గ్రామాల్లో కీలకంగా పనిచేసే ఉద్యోగులకే 11వ తేదీ వచ్చినా వేతనాలు రాలేదంటే వారు సంక్రాంతి పండుగను ఎలా చేసుకుంటారు. ఈ విషయం ప్రభుత్వానికి తెల్వదా? ఎందుకు ఆ ఉద్యోగులపై వివక్ష... తక్షణమే మిగతా ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా వేతనాలు చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు.

## సింగూరు నీటి విడుదలకు

# గ్రీన్ సిగ్నల్

- యాసంగి సాగుకు రైతులు రెడీ
- రేపటి నుంచి నీటిని వదలనున్న ఇరిగేషన్ శాఖ అధికారులు
- 8 నుంచి 10 విడతల్లో నీటి విడుదల

మెదక్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): సింగూరు ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో ప్రభుత్వం నీటి విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో మెదక్ జిల్లాలోని ఘనపూర్ ఆనకట్ట కింద ఆయకట్టు భూములు పూర్తిస్థాయిలో సాగుచేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని మంజీరా మీద నిర్మించిన వనదుర్గా ప్రాజెక్టు కింద కొల్చారం, మెదక్, హవేళీఘనపూర్, పాపన్నపేట మండలాల పరిధిలో 21,625 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ భూములు సాగుకావాలంటే ఎగువన ఉన్న సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలి. వానకాలంలో భారీవర్షాలు కురవడంతో సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. దీంతో వనదుర్గా ప్రాజెక్టు కింద యాసంగి పంటల సాగుకు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో రైతులు సాగుపనుల్లో నిమగ్నమయ్యారు. ప్రాజెక్టు కింద ఎక్కువమంది రైతులు వరి నాట్లు వేయడానికే మొగ్గుచూపుతున్నారు. శుక్రవారం నుంచి నీటిని విడుదల చేయనున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సింగూరు నుంచి విడుదలయ్యే నీటిని ఘనపూర్ ప్రాజెక్టు కింద ఉన్న భూములకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఘనపూర్ డ్యాంకు చేరడానికి 2 నుంచి 3 రోజుల సమయం పడుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. సింగూరు నుంచి వచ్చే నీటిని 8 నుంచి 10 విడతల్లో ఏప్రిల్ వరకు విడుదల చేయనున్నారు.

# సాగునీరు విడుదల చేయాలి

- రైతుబంధు, దళితబంధు, రుణమాఫీ అమలు చేయాలి
- రైతు బీమా, గొర్రెల పంపిణీ, సీఎం అల్పాహారం యథావిధిగా కొనసాగించాలి
- సిద్దిపేట జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ
- చిన్నకోడూరు సాధారణ సమావేశంలో సభ్యుల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

చిన్నకోడూరు, జనవరి 10: రంగనాయకసాగర్ నుంచి అన్ని గ్రామాల్లోని చెరువులకు సాగు నీరు విడుదల చేయాలని సిద్దిపేట జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ కోరారు. చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు బంధు, దళిత బంధు, రుణమాఫీ, గొర్రెల పంపిణీ, రైతు బీమా, సీఎం అల్పాహారం యథావిధిగా అమలు చేయాలని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రంగనాయకసాగర్ నుంచి అన్ని గ్రామాల్లోని చెరువులను నింపడం జరిగిందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని అడగకుండానే సాగు నీటిని విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి నాట్లు వేసుకుంటున్నామని, నీటిని విడుదల చేయాలని అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి మాట్లాడుతూ రైతు బంధు, దళిత బంధు, రుణ మాఫీ, రైతు బీమా, సీఎం అల్పాహారం కొనసాగించాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వనీతారవీందర్‌రెడ్డి, డీసీసీబి జిల్లా డైరెక్టర్ రామచంద్రం, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సోమిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- పెండింగ్, కొనసాగుతున్న పనుల వివరాలు వెంటనే అందజేయాలి
- అత్యవసర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ప్రభాకర్
- ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి



హుస్నాబాద్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 10: హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవో, ఎంఈవోలు, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో మంజూరైన పనుల్లో పెండింగ్ , కొనసాగుతున్న పనుల వివరాలను వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. ఈ నెల 20న ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించిందని, అత్యవసర పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని గురుకులాలు, వసతి గృహాలు, మోడల్ స్కూళ్లను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో అందించే డ్రైవింగ్ లైసెన్సులు ఇక నుంచి హుస్నాబాద్‌లోనే ఇప్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్డీవో బెన్‌షాలోమ్, ఏసీపీ సతీశ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించిన మంత్రిపొన్నం**

హుస్నాబాద్ బస్టాండ్ ఆవరణలో ఇటీవల డిపోకు మంజూరైన రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా మంజూరైన బస్సులను హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉండే రూట్లలో నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ అధికారులు ఉద్యోగులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ప్రొటోకాల్ ఉల్లంఘనలు!

## ఓడినా అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు

## గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఖాతరు చేయని వైనం

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రొటోకాల్ పాటించని కాంగ్రెసోళ్లు
- అధికారుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల అసహనం
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై నేతల ఫిర్యాదు
- కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయకుండా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు
- కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి వచ్చేవరకు చెక్కుల పంపిణీ నిలిపివేత
- గంటన్నరపాటు వేచిచూసి వేదికపై నుంచి వెళ్లిపోయిన ఎమ్మెల్యే ప్రభాకర్
- చింతా ప్రభాకర్ వెళ్లిన తర్వాత వచ్చి చెక్కులు పంపిణీ చేసిన నిర్మలారెడ్డి
- ఏ హోదాలో నిర్మలారెడ్డి చెక్కులు పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ ఆగ్రహం




సంగారెడ్డిలోని నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి హాజరైన చింతా ప్రభాకర్

సంగారెడ్డి, జనవరి 10(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి మెదక్ జిల్లాలో యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి. గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాదని ఓడిన కాంగ్రెస్ నాయకులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ హంగామా చేస్తున్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారుల తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు పార్టీశ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రతి వేదికపై గళం వినిపిస్తున్నారు. కానీ జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇటీవల జరిగిన మహిళల ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభం, ప్రజాపాలన కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి లేకుండా ప్రారంభించారు. ప్రజాపాలన ఫ్లెక్సీలపై ఎమ్మెల్యేల ఫొటోలను ముద్రించలేదు. ఇటీవల నారాయణఖేడ్‌లో నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని మంత్రి దామోదర, ఎమ్మెల్యే సంజీవరెడ్డి విడుదల చేశారు. కార్యక్రమానికి స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పలకలేదు. ప్రొటోకాల్ ఉల్లంఘనల అంశాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, మాణిక్‌రావు ఇటీవల జరిగిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ నిర్వహించిన సమావేశంలో, మంగళవారం జరిగిన జడ్పీ సమావేశంలోనూ లేవనెత్తారు. నిబంధనల మేరకు ఎమ్మెల్యేలు ప్రొటోకాల్ అమలుచేయాలని ప్రభుత్వాన్ని, అధికారులు కోరారు. తాజాగా బుధవారం సంగారెడ్డిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్ షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయకుండా కాంగ్రెస్ నేతలు అడ్డుపడ్డారు. 'మా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.. ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎలా పంపిణీ చేయిస్తారు.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలా మేడం వచ్చేవరకు చెక్కుల పంపిణీ చేయవద్దు.. మా మేడం వచ్చిన తర్వాతే చెక్కులు లబ్ధిదారులకు అందజేయాలంటూ' కాంగ్రెస్ నేతలు పట్టుబట్టారు. గంటన్నరపాటు వేదికపైనే ఉన్న ఎమ్మెల్యే ప్రభాకర్ తాను రెండు చెక్కుల పంపిణీ చేస్తానని, ఆ తర్వాత కాంగ్రెస్ నేతల చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయించాలని అధికారులు, కాంగ్రెస్ నేతలకు సూచించారు. అయినా స్పందన లేకపోవడంతో ప్రభాకర్ చెక్కుల పంపిణీ చేయకుండా వెనుదిరిగారు. చింతా ప్రభాకర్ వెనుదిరిగిన కొద్దిసేపటి తర్వాత కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి వచ్చి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే ప్రభాకర్ చెక్కులు పంపిణీ చేయాల్సి ఉండగా.. ఏ హోదాలో నిర్మలారెడ్డి చెక్కులు పంపిణీ చేస్తారని సంగారెడ్డి బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అధికారిక కార్యక్రమాల్లో నిర్మలారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గంలో అధికారిక యంత్రాంగం ప్రొటోకాల్ పాటించడం లేదు. ఇందుకు బుధవారం ఘటన ఉదాహరణగా చెప్పవచ్చు. సంగారెడ్డి టీఎన్జీవో భవన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి మండలం, మున్సిపాలిటీలోని 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ చేయాలి. కానీ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ప్రభాకర్ చెక్కులు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారు. అలాగే సదాశివపేటలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సైతం ఎమ్మెల్యే హాజరైనా నిర్మలారెడ్డి వచ్చేవరకు చెక్కుల పంపిణీ ప్రారంభించలేదు. నిర్మలారెడ్డి ఏ హోదాలో చెక్కుల పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఎమ్మెల్యే ప్రభాకర్ సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు తనను సంగారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, అధికారులు ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాల్లా మార్చవద్దని అధికారులను కోరారు.

# 13న కైట్ ఫెస్టివల్

- సిద్దిపేట కోమటి చెరువు నెక్లెస్ రోడ్డులో పతంగుల పండుగ
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట కోమటి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, జనవరి 10 : సిద్దిపేట కోమటి చెరువు నెక్లెస్ రోడ్డు మధ్యలో నిర్వహించనున్న కైట్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. సిద్దిపేట కోమటి చెరువు వేదికగా ఈ నెల 13న ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. బుధవారం కార్యక్రమం ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. సిద్దిపేట బీఆర్ఎస్ యువత, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగే కైట్ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల సాయిరామ్, రామచందర్‌రావు, పట్టణ యువత అధ్యక్షుడు రెడ్డి పభాకర్‌రెడ్డి , విద్యార్థి విభాగం పట్టణ సమన్వయకర్త రమేశ్, యువత నాయకుడు సిద్ధు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తాం

- సిద్దిపేట కలెక్టర్ పీజే పాటిల్

సిద్దిపేట అర్బన్, జనవరి 10: మల్లన్నసాగర్ ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరిస్తామని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)తో కలిసి రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగం, కాంట్రాక్టర్లలతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన ఎర్రవల్లి, సింగారం, ఏటిగడ్డ కిష్టాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, వేములఘాట్, కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాలైన మామిడాల, బైలంపూర్, తానెదార్‌పల్లి గ్రామాల వారీగా ఆర్అండ్ఆర్ కాలనీల్లో గ్రామపంచాయతీ ఎన్నికల్లోపు విలేజ్ మ్యాప్‌లు తయారు చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పన, ఓపెన్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ సైతం పూర్తి చేయాలన్నారు. ఆర్డీవోలు రమేశ్‌బాబు, బన్సీలాల్, విద్యుత్‌శాఖ ఎస్ఈ మహేశ్, అధికారులు పాల్గొన్నారు.